ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023 5 విజయనగరం

వడదెబ్బతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-వంగర

విజయనగరం జిల్లా వంగర మండలంలోని సంగాం గ్రామానికి చెందిన హోంగార్డు వెలగాడ ప్రకాశం (53) మంగళవారం హఠాన్మరణం చెందారు. ఆయన వంగర పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీహరిపురంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఓ చెరువు వద్ద బందోబస్తుకు వెళ్లి మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో తన నివాసానికి చేరుకున్నారు. గ్లాసుడే నీరు తాగి సేదతీరుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్ప కూలిపోయి మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆయనకు భార్య రోజా, పిల్లలు హారిక, మాధురి, హిందు ఉన్నారు. 26 ఏళ్ల క్రితం విధుల్లో చేరిన ప్రకాశం అందరితో కలివిడిగా ఉండేవాడిని ఇలా హఠాన్మరణం చెందడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు.

పోలీసుబ్యారెక్స్ వద్ద రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసు సిబ్బంది

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద విరిగిపోయిన ఫ్లెక్సీ

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, హోర్డింగ్‌లు ●కూలిపోయిన విద్యుత్తు స్తంభాలు ● నగరమంతా అంధకారం ●పిడుగుపడి కాపరి మృతి

ప్రజాశక్తి -విజయనగరం, జామి, గజపతినగరం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో పాటు వడగళ్ళ వర్షం కురిసింది. విజయనగరంలో సుమారు గంటపాటు వీచిన గాలులకు హోర్డింగ్‌లు నేల కూలాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది స్పందించి చెట్ల కొమ్మలను తొలగించింది. పోలీసు బ్యారెక్స్ వద్ద రహదారిపై పెద్ద చెట్టు కూలిపోవడంతో విజయనగరం, గజపతినగరం మధ్య వాహనాల రాకపోకలు చాలా సేపు నిలిచిపోయాయి. పోలీసులు స్పందించి చెట్టును తొలగించడంతో సాయంత్రం రాకపోకలు పునరుద్ధరణ జరిగాయి.

విద్యుత్తు స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

గాలులకు నగరంలోని పలు షాపు రూముల అద్దాలు పగిలాయి. వర్షంతో ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు సిబ్బందితో తొలగించే ఏర్పాట్లను నగరపాలక సంస్థ చెందిన అధికారులు పర్యవేక్షించారు. గాలుల వల్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో నగరమంతా రాత్రి 8గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు విల విలలాడిపోయారు. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వజన ఆస్పత్రిలో రోగులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

రాత్రి 11గంటల వరకు పునరుద్ధరణ కాని విద్యుత్ సరఫరా

ఈదురుగాలులతో చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపోవడంతో నగరమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివిధ ప్రాంతాల్లో 18 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాత్రి 11గంటలవరకు విద్యుత్ రాకపోవడంతో ప్రజలంతా విల విలలాడిపోయారు. విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ ప్రక్రియ రాత్రంతా కొనసాగింది. గాలికి అనేక చెట్లు విద్యుత్తు స్తంభాలపై విరిగిపడిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్తుశాఖ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పలుచోట్ల రాత్రి 8గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా ఎక్కువ చోట్ల పునరుద్ధరణ కాలేదు. చెట్లు కొమ్మలు తొలగించేందుకు, స్తంభాలను సరిచేసేందుకు సుమారు 250 మంది సిబ్బంది పని చేస్తున్నారని ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ అయ్యేవరకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గజపతినగరంలో భారీ గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వర్షంతో ప్రజలు సేద తీరారు. జామిలో ఈదురుగాలుల భీభత్సం సృష్టించాయి. గ్రామంలో పలు చోట్ల చెట్లు నేల కూలాయి. మంగళవారం 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమొదైనప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. తొలుత ఈదురు గాలులు రాగా, చెదురుమదురు జల్లులు కురిశాయి. దీంతో జనం సేదతీరారు. మరోవైపు గత మూడు రోజులుగా ఎండలు తీవ్రమై, ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ప్రజలకు ఊరట కలిగించింది.

పొలాల్లో కూలిపోయిన విద్యుత్తు స్తంభం

మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

పిడుగుపడి పశువుల కాపరి మృతి

జామి మండలంలోని కొత్త భీమసింగి గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పారావు (40) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గ్రామంలోని పొలాల్లో పశువులు కాస్తుండగా, పిడుగు పడడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. దీంతో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. అప్పారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎస్ఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంకలాంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రెండు నెలల్లో 1300 ఇళ్లు పూర్తి కావాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- గుంకలాం, కొండకరకాం లే అవుట్‌ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ఇళ్లులేని నిరుపేదల కోసం గుంకలాం, కొండకరకాం గ్రామాల వద్ద రూపొందించిన గృహ నిర్మాణ లే అవుట్లలో వచ్చే రెండు నెలల్లో 1300 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గుంకలాం లో 1000, కొండ కరకాంలో 300 పూర్తిచేయాలని ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రైవేట్ నిర్మాణ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేశారు. మూడో ఆప్షన్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణం లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే రెండు నెలల కాలంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను రప్పించాలని, పునాది స్థాయికి మరో 1000 ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో గుంకలాం, కొండకరకాంల వద్ద చేపట్టిన లే అవుట్ లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి, డిఇలు, ప్రైవేట్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. గుంకలాంలో 8వేలు, కొండ కరకాంలో 5వేల ఇళ్ల నిర్మాణం ఆప్షన్ -3 కింద రాక్రీట్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతోందని పీడీ రమణ మూర్తి వివరించారు. తగినంతగా భవన నిర్మాణ కార్మికులు లేకపోవడం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చే వారం రోజుల వ్యవధిలో కార్మికులను రప్పించి పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిర్మాణ సంస్థ తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కొండ కరకం లే అవుట్ సందర్శించారు. ఈ పర్యటనలో గృహ నిర్మాణ సంస్థ డిఇలు రంగారావు, వర్మ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో 'సత్య' విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోట పాలెం లో గల సత్య డిగ్రీ, పిజి కళాశాలలో కోచ్ కె.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కిక్ బాక్సింగ్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల జరిగిన 31వ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్, జాతీయ టీమ్ ఎంపికలో బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలు వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్, వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్, ఇండియన్ యూనివర్సిటీ అసోసియేషన్ తో గవర్నమెంట్ ఆఫ్ మినిస్ట్రీ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యా నిర్వహించారు. దీపక్ కుమార్, ఆర్.వంశీవరుణ్ బంగారు పతకం, ఎ.చంద్రమౌళి, యు.దుర్గాప్రసాద్ రజిత పతకం, యు.దుర్గారవి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి సాయి దేవ మణి పాల్గొన్నారు. శశిభూషణ్ రావు గారు విద్యార్థులను అభినందిస్తూ ఈ కిక్ బాక్సింగ్ లో ఇంకా రాణించి అనేక పతకాలు సంపాదించాలని అన్నారు.


ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

తరచూ బిపి, షుగర్ చెక్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు బిపి, సుగర్‌ను సకాలంలో చెక్ చేయించుకోవాలని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దరిసిపూడి రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మదర్ థెరీసా ఫిజియోథెరపీ క్లినిక్ ఆధ్వర్యంలో విజయనగరం క్వీన్స్ ఎన్నారై సౌజన్యంతో స్థానిక 25వ డివిజన్ రైల్వే స్టేషన్ సున్నం బట్టి ఏరియాలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమేష్ కుమార్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రత రోజుకు పెరుగుతున్నందున బిపి, షుగర్ పేషెంట్లు జాగ్రత్తగా ఉండి సకాలంలో మందులు తీసుకోవాలని అన్నారు. క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ నందు అన్ని సౌకర్యాలు అత్యధిక టెక్నాలజీతో అందుబాటులో 24 గంటలు ఉంటాయని తెలిపారు. మదర్ తెరిసా ఫిజియోథెరపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పాండ్రింకి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో ఇసిజి, బిపి,సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ ప్రసాద్ కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ సంతోష్ కుమార్, డెంటల్ డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించారు, ఎన్ఆర్ఐ మెడికల్ క్యాంపు కన్వీనర్ సిహెచ్. మోహన్ రావు, పిఆర్ఒ బంగార్రాజు, మదర్ తెరిసా ఫిజియోథెరపీ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తీరు మారకపోతే ఎసిబి అధికారులతో దాడి చేయిస్తా

- అధికారులపై డిప్యూటీ సిఎం వివాదస్పద వ్యాఖ్యలు
- గిరిజనుల సమస్యలపై స్పందించిన మంత్రి

ప్రజాశక్తి-మెంటాడ

ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే తీవ్రమైన చర్యలు తప్పవని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర హెచ్చరించారు. అప్పటికీ తీరు మారకపోతే ఎసిబి అధికారులతో దాడి చేయిస్తానని అన్నారు. మంగళవారం మండలంలోని కొండ లింగాల వలస గ్రామ సచివాలయ పరిధిలో గల సవరవిల్లి, పాతపాడు, శీలవలస, మామిడి వలస గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజనులు సచివాలయంలో గాని, మండల కార్యాలయంలో గాని మమ్మల్ని పట్టించుకునే నాధుడు లేడని, తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ధ్రువపత్రాలు మంజూరు చేయడం లేదని, పెన్షన్ల విషయంలో చొరవ చూపడం లేదని తెలిపారు. ఇలా పలు సమస్యలను ఆయన దృష్టికి తేవడంతో మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి

రాజన్నదొరకు సమస్యలు చెబుతున్న గిరిజనులు

మండల అధికారులపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, పై అధికారులుగా తమరు కూడా పట్టించుకోకపోతే ఎసిబితో దాడులు చేయిస్తానని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందిపై దృష్టి సారించి ప్రభుత్వ ఆశయానికి భంగం కలగకుండా సమస్యలు తక్షణ పరిష్కారానికి సచివాలయాలు పనిచేయాలని అన్నారు. మండల అధికారులు ఎప్పటికప్పుడు సచివాలయాలపై పర్యవేక్షణ ఉండాలని ఎంపిడిఒను ఉద్దేశించి ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాడి వరహాలమ్మ, వైసిపినాయకులు సిరిపురం నాగమణి, ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, లెంక రత్నాకర్ నాయుడు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఆదిబాబు, గృహ నిర్మాణ శాఖ ఎఇ డేవిడ్ రాజ్, మండల సచివాలయాలు కన్వీనర కనిమెరక త్రినాథ్, బాయి అప్పారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఈనెల 18న టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎస్.కోట నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. మంగళవారం స్థానిక అశోక్ బంగ్లాలో వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18, 19 తేదీల్లో నియోజకవర్గంలో పర్యటిస్తారని తెలిపారు. చంద్రబాబు నాయుడు వచ్చిన ప్రతిసారి ఆనవాయితీ ప్రకారం కొత్తవలస దగ్గర ఉన్న చింతలపాలెం వద్ద ఘన స్వాగతం అశోక్ గజపతిరాజు నాయకత్వంలో పలకడం జరుగుతుందని తెలిపారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై కార్మికులు, రైతులు చంద్రబాబుకు వినతి అందజేస్తారని తెలిపారు. జిల్లాలో బిసి నాయకులకు జరుగుతున్న అన్యాయంపై చంద్రబాబుతో మాట్లాడుతారని తెలిపారు. గురువారం సాయంత్రం దేవి బొమ్మ కూడలిలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయండి అని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాగార్జున, లలితకుమారి

పరుగు పందెంలో ఆగిన ఊపిరి

ప్రజాశక్తి-వీరఘట్టం

పోలీసు శాఖలో ఉద్యోగం సంపాదించాలనే అతడి ఆశ చివరకు పరుగు పందెంలో ఊపిరి ఆగిపోయింది. ఎంతో తపనతో నిత్యం వ్యాయం చేస్తూ ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలని అతని జీవితం అర్థాంతరంగా ముగిసిపోయింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని ఎం.రాజపురం దళిత వీధికి చెందిన డర్రు రాజేష్ (21) మంగళవారం అనకాపల్లిలో జరిగే ఎస్ఎస్‌సి సెలక్షన్‌కు వెళ్లాడు. ఎంపికలో భాగంగా అతడు పరుగెడుతుండగా ఊపిరి ఆడక ఒక్కసారిగా గుండె ఆగి కుప్ప కూలిపోయాడు. సిబ్బంది తక్షణమే అంబులెన్సులో చికిత్స కోసం హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం అతని స్నేహితుడు గ్రామ యువకులకు తెలియడంతో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. ఒక్కసారి వీధి అంతా ఉలిక్కిపడింది. రాజేష్ వీరఘట్టంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఈయనకు తల్లిదండ్రులు సింహాచలం, కుమారి, నాన్నమ్మ నరసమ్మ, చెల్లెలు ఉంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. విషయం తెలిసిన వెంటనే బంధువులు అనకాపల్లి బయలుదేరారు.రాజేష్ మృతి చెందాడన్న విషయం తెలియడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు కూడా బోరున విలపిస్తున్నారు.

మృతుడు రాజేష్

3,522 మందికి మత్స్యకార భరోసా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని 3,522 మంది మత్స్యకారులకు, మత్స్యకార భరోసా పథకం కింద రూ.3.52 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విడుదల చేశారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో, బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాలో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను జిల్లా నుంచి కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ , డిఆర్ఒ ఎం.గణపతిరావు తిలకించారు. అనంతరం లబ్దిదారులకు రూ.3.52 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలోని మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా, ప్రతీ ఏటా రూ.10వేలు చొప్పున ఆ కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. నాలుగోసారి జిల్లాలోని 3,522 మందికి రూ.3.52 కోట్లను విడుదల చేశారన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. సీ పోర్టులు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడమే కాకుండా, మత్స్యకార నాయకులకు మంత్రి పదవులు, రాజకీయ పదవులను కేటాయిస్తూ, వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిడి ఎన్.నిర్మలాకుమారి, పూసపాటిరేగ ఎంపిపి మహంతి కల్యాణి, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, డైరెక్టర్ మైలపిల్లి నర్సింహులు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, మత్స్యకార సంఘ నాయకులు, మత్స్యశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు చెక్కును అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్, ఎమ్ఎ, ఎమ్మెల్యే

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డెంగీ వ్యాప్తిని నిరోధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం వైద్యాధికారి డాక్టర్ కె.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి గంటస్తంభం వరకు ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు, జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది, ఫైలేరియా నివారణ సిబ్బంది, మున్సిపల్ హెల్త్ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. 'ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి-డెంగ్యూ వ్యాధిని అరికట్టండి ', పరిసరాల పరిశుభ్రత-ఆరోగ్యానికి భద్రత, దోమ కాటు-ఆరోగ్యానికి చేటు, నీటి నిల్వలను తొలగిద్దాం - దోమల పెరుగుదలను అరికడదాం, అనే నినాదాలతో ర్యాలీ సాగింది.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, శానిటేషన్ కార్యదర్శులు

ఘోష ఆసుపత్రి ఆధ్వర్యంలో....

నగరంలోని ఘోష ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. శిరీష నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది, ఫైలేరియా నివారణ యూనిట్ సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

డెంకాడ : మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్లో ఉన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం డిఇఒ లింగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఇప్పటి వరకు రాష్ట్రం నుండి జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు, బెల్టులు, సాక్సులను, స్టాక్ రిజిస్ట్రార్‌లను తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ జగనన్న విద్యా కానుకలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి అందివ్వాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు.

పాఠశాలలో సౌకర్యాలపై కరపత్రం విడుదల

శంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకూ పాఠశాలలో లభించే విద్యా సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రహీం షేక్ లాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బి కిరణ్ కుమార్, ఎల్ వి సత్యనారాయణ, బి శ్రీదేవి, సిబ్బంది ఉమా తదితరులు ఆధ్వర్యంలో కరపత్రాలను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. పాఠశాలలో సకల సదుపాయాలను వివరిస్తూ గత సంవత్సరం వలే కరపత్రాలను ముద్రించి వాటి ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు రహీం షేక్ లాల్ తెలిపారు. బడి ఈడు పిల్లలు బడిలో చేరేటట్లు వివిధ గ్రామాల్లో రెండో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఐదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, 8వ తరగతి ఉత్తీర్ణమైన విద్యార్థులు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్చుకునే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో లభిస్తున్న విద్యాపరమైన సౌకర్యాలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

వేపాడ : మండలంలోని కరకవలస, సోంపురం, వేపాడ, జాకీర్ గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్యం పనులు చేపడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మరుగును తొలగించి చెత్త బండ్ల ద్వారా ఎస్‌డబ్ల్యూపి కేంద్రాలకు తరలించడంతోపాటు కాలువల్లో బ్లీచింగ్ జల్లారు. ఈ పనులను ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపి షెడ్లను పరిశీలించారు.

వర్షంతో హర్షం..

వేపాడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత రెండు రోజులుగా విపరీతమైన ఎండల కాయడంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఈ వర్షంతో ఉపసమనం పొందారు.

సచివాలయ సిబ్బందితో సమావేశం

బొబ్బిలి : పట్టణంలోని 15వ సచివాలయ (4,29 వార్డు) సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పని చేయని వాలెంటర్స్‌ను తక్షణమే తొలగించాని ఆదేశించారు. వార్డులో వచ్చిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు రేజేటి ఈశ్వరరావు, అమర్ నాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు వస్తే సహించేది లేదు

వేపాడ : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి, గ్రీన్ అంబాడర్లకు గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సిన విధులపై మంగళవారం ఎంపిడిఒ పట్నాయక్ వివరించారు. విధి నిర్వహణలో సిబ్బందిపై ప్రజల నుండి ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త వైఖరిపై అధికారుల సమీక్ష

'ప్రజాశక్తి' కందనానికి స్పందన

లక్కవరపుకోట : మండలంలోని గేదెలవానిపాలెం సర్పంచ్ చప్ప కనకలక్ష్మి భర్త దేవుడు వైఖరిపై ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం అధికారులు సమీక్షించారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 12 న 'మాజీ సర్పంచ్ కక్ష సాధింపు' 14న 'పనులు పూర్తిచేసినా అందని బిల్లులు' అనే శీర్షికలతో వరుస కథనాలకు స్పందించిన డివిజనల్ పంచాయతీ అధికారి (డిఎల్‌పిఒ) ఏ. మోహనరావు సోమవారం గేదెలవానిపాలెం సచివాలయాన్ని సందర్శించారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు డిడిఒ ఆర్ తులసి, కార్యదర్శి సింగంపల్లి రోహిణి కుమారులను ఆరా తీశారు. సచివాలయ నిర్మాణ పనులు పూర్తయినందు వల్ల కాంట్రాక్టర్‌కి ఇవ్వవలసిన బిల్లులు త్వరతగతిన చెల్లించే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ విషయంపై మరో మారు ఎంపిడిఒ జ్ఞానేశ్వర్రావు అధికారులతో మంగళవారం తన కార్యాలయంలో సమీక్షించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ గేదెల నరసింహనాయుడుకు అందాల్సిన బిల్లులు అలసత్వం కాకుండా చూడాలని డిపిఒ ఆర్ తులసి ఆదేశించారు.

రామచంద్ర పేటలో కొత్తమ్మ తల్లి పండగ

భోగాపురం: మండలంలోని రామచంద్ర పేట గ్రామంలో గ్రామ దేవత శ్రీ కొత్తమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు గ్రామ నాయకులు రామసూరి తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు పసుపు, కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని నందిగాం పంచాయతీ గరే నందిగాం గ్రామదేవతలైన దుర్గాలమ్మ, బంగారమ్మ, పాదాలమ్మ అమ్మవార్ల పండగ నేపథ్యంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం అమ్మవార్లును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, సర్పంచ్ గరె మురళి మోహన్, సుందర హరీష్, గోపి, ఎంపిడిఒ బంగారయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమృత సరోవర్ చెరువుల సందర్శన

భోగాపురం: నందిగామ పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో గ్రామంలో ఉన్న చెరువును అమృత సరోవరంగా అభివృద్ధి చేశారు. సర్పంచ్ గరే మురళీమోహన్‌రావు ప్రత్యేక శ్రద్ధతో చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం పరిశీలించి ఆయన్ను అభినందించారు. ఇటీవల జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీగా కూడా నందిగామ పంచాయతీ ఎంపికయింది.

శాంతియుతంగా మెలగాలి : డిఎస్‌పి

వంగర: తగాదాలకు తావు లేకుండా సమస్య ఏదైనా ఉంటే చర్చించుకుని శాంతియుతంగా మెలగాలని చీపురుపల్లి డిఎస్‌పి ఎఎస్ చక్రవర్తి అన్నారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో గల ఓ చెరువులో పక్కనే ఉన్న మరొక పంచాయతీ ఆర్‌ఆర్ కాలనీకి చెందిన ప్రజలు ఉపాధి హామీ పనులు చేయడంతో శ్రీహరిపురం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు గ్రామస్తులు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఈ విషయం తెలుసుకున్న డిఎస్‌పి రెండు గ్రామాలకు చెందిన పెద్దలును గ్రామస్తులతో పాటు అధికారులతో వంగరలో మంగళవారం చర్చించి రాజీ కుదుర్చారు. అంతకుముందు వంగర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు, రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ ఆర్ జనార్దన్ రావు, ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, నాయకులు కరణం సుదర్శన రావు, తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులకు విద్యుత్ అంతరాయం

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం వర్షంతో కూడిన ఈదురుగాళ్లుతో విద్యుత్ స్తంభం పై చెట్టు కూలిపోయి విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సౌకర్యం కల్పన కోసం సాయంత్రం సిబ్బంది కృషి చేయడంతో విద్యుత్తు సౌకర్యం పునారావృతం అయింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బానుడు భగ..భగ..

- 45 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యమవుతున్న రహదారులు
- పలు చోట్ల వడగాల్పులు

ప్రజాశక్తి - రేగిడి

ఎండ వేడి తీవ్రతతో పాటు వడగాలులకు ప్రజలు అల్లాడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మే నెలలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకోవడంతో భగ భగ మండే ఎండలతో జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో ప్రధాన రహదారులు, గ్రామాలలో ఉన్న వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ తీవ్ర ఎండలతో పాటు ఉక్కబోత కారణంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం పాలకొండ - విశాఖపట్నం ప్రధాన రహదారి వడగాల్పులు కారణంగా నిర్మానుష్యంగా మారింది. మరో వారం రోజులు పాటు తీవ్ర ఎండలు, వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. ఎండలకు భయపడి ఆర్థిక స్తోమత ఉన్నవారు కూలర్లు, ఏసీలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే విపత్తుల కేంద్రం నుంచి అనేక సూచనలు సలహాలు అందిస్తున్నారు. ఎండలో తిరగొద్దని, అవసరం మేరకు బయటికి వెళ్లాలని, ఉన్ని దుస్తులు వేసి టోపీలు పెట్టాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, కొబ్బరి నీళ్లు, నిమ్మ నీరు తప్పనిసరిగా వాడాలన్నారు. చల్లని ప్రదేశాల్లో ఉండాలని చెబుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న పాలకొండ- విశాఖ ప్రధాన రహదారి

వడదెబ్బలకు గురికాకుండా ప్రజల అప్రమత్తంగా ఉండాలని రేగిడి, బూరాడ వైద్యాధికారులు అసిరి నాయుడు, భార్గవి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

చలివేంద్రంలో పార్కింగ్ చేసిన వాహనాలు

తహశీల్దార్ కార్యాలయంలో నీరు కరువు

శృంగవరపుకోట: ఈ ఏడాది వేసవితో పాటు తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచి నీటిని అందించే చలివేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అప్పటి నుంచి వేసవి ఎండలు తీవ్రత కొనసాగుతూనే ఉంది. కానీ ప్రారంభమైన చలివేంద్రం మరుసటి రోజే మూలకు చేరింది. అప్పటి నుండి తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో కార్యాలయాలలో పొన్నూరు నుండి వచ్చేవారికి గుక్కెడు మంచినీళ్లు దొరకడమే కరువైంది. ఇటీవల కాలంలో ఎండ తీవ్రత అధికం అవ్వడంతో కార్యాలయానికి వచ్చిన ఒకరిద్దరూ సొమ్మగిల్లిన పరిస్థితిలు నెలకొన్నాయి. ఈ కార్యాలయ ప్రాంగణంలో ఉప ఖజానా కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయం, ఎన్‌జిఒ హోమ్ వంటివి ఉన్నాయి. వీటిలో తమ అవసరాల నిమిత్తం ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయాలకు వస్తూ ఉంటారు. దాహార్తిని తీర్చేందుకు గుక్కెడు నీళ్లు దొరకకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. చలివేంద్రం కోసం ఏర్పాటు చేసిన పందిరి కార్యాలయాల అవసరాల కోసం వచ్చేవారు వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాహార్తిని తీర్చేందుకు మంచినీళ్ల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నేనంటే ఎందుకంత నిర్లక్ష్యం?

- మీ బరువులు ఇక మోయలేను
- బ్రిటిష్ కాలంనాటి మధుము కన్నీటిగాథ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

నేనంటే పాలకులకు, అధికారులకు ఎందుకంత నిర్లక్ష్యమో అర్థం కావడంలేదు. ఈ మధ్యకాలంలో నన్ను ముస్తాబు చేయడంతో బయటికి అందంగా కనిపించినా లోలోపల నా ఆరోగ్యం క్షీణించింది. ఎప్పుడు కూలిపోతానో నాకే తెలియదు. నాకు శక్తి సన్నగిల్లింది. గట్టిగా ఉన్నాన్నాళ్ళు నన్ను వాడుకున్నవారే తప్పా నా శ్రేయస్సును ఇసుమంతైనా పట్టించుకోలేదు. వృద్ధాప్యం మీదన పడడంతో నా శక్తిపై నాకే నమ్మకం నశించిపోయింది. ఇప్పటికీ అప్పటిలాగే నాపై బరువులతో ప్రయాణిస్తామంటే ఇక నేను తట్టుకోలేను. ఎప్పుడో బ్రిటిష్ హయంలో కొన్ని దశాబ్దాల కిందట నన్ను నిర్మించారు. అప్పట్లో నన్ను గట్టిగానే నిర్మించేందుకు తోడ్పడి నాకు శక్తినిచ్చారు. ఎంత దృఢంగా నిర్మించినా కొన్నాళ్లేకదా! శక్తి ఉండేది. విశాఖ - అరకు వెళ్లే ప్రధాన రహదారిలో సోంపురం జంక్షన్ సమీపాన ఉన్న నాపై దేశ విదేశాల నుండి అధికంగా టూరిస్టులు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన పరిశ్రమలకు రవాణా చేసేందుకు ఎంతగానో తోడ్పడుతున్నాను. ఇప్పటికీ అప్పటిలాగే నాపై దూసుకు వెళ్తున్నప్పుడు నేను పడే బాధ వర్ణనాతీతం. అధికారికంగా పెరిగిన రద్దీకి నేను చాలా ఇరుకుగా ఉన్నాననే సంగతి కూడా మరిచిపోవడం విచారకరం. నా పక్కనే ఎల్ కోట కూడలికి సమీపంలో విధులు నిర్వహిస్తున్న నాతోటి మదుమును

ఇరుకుగా ఉన్న మధుము ఇదే..

వెడల్పు చేశారు. సంతోషకరమైన విషయమే. కానీ నేను కూడా అదే మాదిరిగా సేవలందిస్తున్నాను కదా ? అయినా నన్ను వెడల్పు చేయకుండా విడిచిపెట్టి నాపై చిన్న చూపు చూడటం అన్యాయంగా భావిస్తున్నాను. ఈ మధ్యకాలంలో అధిక బరువుతో వచ్చిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కొంతమేర నేను అనారోగ్యానికి గురయ్యాను. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎం ముకుందరావు నాపై జాలి చూపి నా ఆరోగ్యాన్ని కుదుటపరిచారు. కానీ ఇటీవల నాపై పెద్ద నింద మోపారు. నేను ఇరుకుగా ఉన్నందువల్లనే ఈ నెల 9న గొల్జాం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి పిన్నింటి జగదీష్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని నా ఒడిలోనే (మధుము మధ్యలో) మృతి చెందాడని అందరూ అంటుంటే వినడానికి చాలా బాధగా ఉంది. నాపై నిర్లక్ష్యమో..? ఏమో..? తెలీదు గానీ ఏళ్ల గడుస్తున్నా నావైపు కన్నెత్తి చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు లేరంటే ఒట్టు. మిమ్మలందరినీ వేడుకునేది ఒక్కటే అప్పటిలాగే ఇప్పుడు కూడా నాపై దూసుకెళ్తామంటే ఆ తరువాత ఏం జరిగినా నాకు సంబంధం లేదని తెలిపేందుకే ఉన్నతాధికారులకు ఈ లేఖ రాస్తున్నాను. పెద్ద మనసుతో నాపట్ల స్పందించి త్వరతిగతిన నన్ను విస్తీర్ణంలో బలం చేకూరుస్తే మరెన్నేళ్ళు సేవలందిస్తాను. మరి అధికారుల స్పందన కోసం వెయ్యి కళ్ళతో వేచి చూస్తూ...

సోంపురం జంక్షన్ సమీపాన, ఇరుకు మధుము..

పెన్షనర్ల ఇంటి వద్దే ఇకెవైసి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో గల కన్నప్పదొరవలసకు చెందిన మరడాన స్వామినాయుడు ఇంటి వద్దకు మంగళవారం ఎస్‌టిఒ కె.శంకరరావు వెళ్లి ఇకెవైసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 562మంది పెన్షనర్లు ఇకెవైసి చేయించుకున్నారని, ఇంకా 225 మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాల్సిన అవసరం ఉందని,త్వరగా వారు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షులు టి.పాండురంగ, పెన్షనర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అఖండ అన్న సంతర్పణ

వీరఘట్టం : మండల కేంద్రంలోని మంగళవారం ఘనంగా అఖండ అన్నసంతార్పణ కార్యక్రమం నిర్వహించారు. పైడితల్లి గ్రామ దేవత మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామ దేవత ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డెంగీపై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస, వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం జాతీయ డెంగీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సీతామహాలక్ష్మి, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో దోమలు పెరుగుదలను అరికట్టవచ్చునన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించి దోమలు ద్వారా వచ్చే వ్యాధులను నివారించాలన్నారు. ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస, వియ్యంపేట పిహెచ్‌ఎల్ సిబ్బంది, ఎంపిహెచ్ఒ తిరుపతిరావు, పి.హెచ్.ఎన్.

శృంగవరపుకోట: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ, ఈ.ఓ. తిరుపతి రావు, హెచ్.వి.పద్మావతి, ఫార్మసిస్ట్ ఆశ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరావు, ఏఎన్‌ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

కొత్తవలస : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపు కోట: మండలంలోని కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ బి శిరీష ఆధ్వర్యంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. నందయ్య అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని దేవి కూడలిలో జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ డెంగ్యూ దినోత్సవం పై అవగాహన కల్పిస్తూ స్థానిక దేవి గుడి నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు సిబ్బందితో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలు పలు నినాదాలు చేశారు.

పిహెచ్‌సిలో జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవం

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేపాడలో ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కే రాజు, ఏ ధరణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధుల బారిన పడతారన్నారు. అనంతరం ఎఎస్‌పేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో 68 మందికి వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓఎస్ జిఆర్. ఆంజనేయులు, హెచ్‌ఎస్ వివి రమణ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ ధరణి

టిడిపి పని అయిపోయినట్టే..

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

టిడిపి పని అయిపోయిందని, వచ్చే ఎన్నికల తర్వాత ఇంక ఆ పార్టీకి మనుగడే ఉండదని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైసిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని చెప్పారు. తమ ప్రభుత్వ పనితీరు, పార్టీ విధివిధానాలు నచ్చి, అనేకమంది వస్తున్నారని తెలిపారు. వారందరికీ వైసిపి కుటుంబంలోకి ఆహ్వానం పలుకుతున్నామన్నారు. మంగళవారం స్థానిక 47వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు పతివాడ రమణమూర్తి ఆధ్వర్యంలో కెఎల్ పురానికి చెందిన పలువురు నాయకులు ఆ పార్టీని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కోలగట్ల పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అటు రాష్ట్రంతోపాటు, ఇటు విజయనగరం నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామని వివరించారు. దశాబ్దాల తరబడి కేఎల్‌పురంలో ఉన్న నీటి సమస్యకు త్వరలోనే ముగింపు లభిస్తుందని, సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచినీటి పథకం వచ్చే అక్టోబరు నాటికి అందుబాట్లోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జిలు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో మండల గోవిందరావు,

శాసనసభ ఉప సభాపతి కోలగట్ల

బ్రోచర్‌ను అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ స్వామి

పి.రాజేష్, కొర్ని కిరణ్‌కుమార్, పెదగాడి వరుణ్‌కుమార్, కోశా నారాయణరావు, శింగంశెట్టి రాజేశ్వరరావు, చిక్కాల తారకేశ్వరరావు, వడ్లమాని సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నగరంలోని 42 డివిజన్ కామాక్షి నగర్, కాళీఘట్ కాలనీలో రూ.22 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవాలు చేశారు. కామాక్షి నగర్‌లో ముత్యాలమ్మ ఆలయ పరిసరాలలో అభివృద్ధి పనులు, కాళీఘట్ కాలనీలో రహదారులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో అభివద్ధికి నోచుకోని అనేక ప్రాంతాలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో అభివద్ధి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, సైలాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ..

30వ డివిజన్‌లోని నోబుల్ నగర్, వసంత విహార్ ప్రాంతాలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆశీస్సులు అందించాలని ప్రజలను కోరారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌ఛార్జి మారెం బాల బ్రహ్మారెడ్డి, టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లీడర్ షిప్ శిక్షణ

ప్రజాశక్తి- శృంగవరపు కోట

వాసవి క్లబ్ జిల్లా 214 ఏ అధీనంలో రెండు రోజులపాటు పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన వాసవి అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసిందని అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం చైర్మన్ హెచ్ నానాజీ మంగళవారం తెలిపారు. ఈ ప్రోగ్రాంలో 80 మంది వాసవియన్స్ తమ వ్యక్తిగత శిక్షణ కార్యక్రమాన్ని తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ లీడర్షిప్ ట్రైనింగ్‌తో పాటు బిజినెస్ స్కిల్స్ అదేవిధంగా సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటూ ఆర్థిక పరిపుష్టత ఏ విధంగా కలుగుతుందన్న అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వపు అంతర్జాతీయ అధ్యక్షుడు వాసవియన్, గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ డాక్టర్ తిరువీధి, వేణుగోపాల్ పైలట్ ఫ్యాకల్టీగా వ్యవహరించారు. వాసవి అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ సెమినార్‌కి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కార్యదర్శి వాసవియన్ గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ ఇరుకుల్ల రామకృష్ణ హాజరయ్యారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఆర్.జమ్ములోని మాతోట లబ్దిదారుల క్షేత్రంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవడానికి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో బోరు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాతోట లోని మామిడి, సపోటా, జీడి, అంతర పంటలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. చాపరాయి బిన్నిడిలో గ్రావిటీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆర్థిక సహకారం రూ.3 లక్షలు, గ్రామస్తుల శ్రమదానం రూ.లక్ష 63 వేల 49తో జట్టు సంస్థ పర్యవేక్షణలో నిర్మించినట్లు జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పథకాలను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకొని ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా అడుగులు ముందుకు వేయాలని ఇందుకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల పరంగా వస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ గ్రావిటీ ద్వారా ఎన్ని కుటుంబాలకు మంచినీరు సరఫరా అవుతుంది, ఎన్ని ఎకరాలకు, ఎన్ని గ్రామాలకు పంటలు పండించుకోవడానికి నీరు సరఫరా సరిపోతుందని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 75 ఇళ్లకు మంచినీరు సరఫరా, చాపరాయిబిన్నిడి, మూలబిన్నీడి గ్రామాల్లోని 75 మంది రైతులకు 140 ఎకరాల వరకు పంట పొలాలకు సమృద్ధిగా పంటలు పండించుకోవడానికి అవకాశం కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రకృతిని, పంటలను వినాశపరిచే ఏ కార్యక్రమాలు కూడా ఎవరు చేయకూడదని, ప్రకృతిని పరిరక్షించే మానవాళికి సహాయపడే కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ స్వతసిద్ధంగా చేయాలన్నారు. గతంలో పార్వతీపురం ఐటిడిఏ ప్రాంతంలో పనిచేసినప్పటి అనుభవాలను, గ్రామస్తులతో పరిచయాలను సుబ్రహ్మణ్యం గుర్తు చేసుకున్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలు, పలుపంటలు ఏడాది పొడవునా పండించుకునేలా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. జట్టు సంస్థ గిరిజన గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో గల ప్రజలను చైతన్యపర్చడం, పథకాలను వారి చెంతకే చేరవేయడంలోనూ, మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక యంత్ర పరికరాలను వినియోగించుకోవడం వంటి సూచనలు, సలహాలు సంబంధిత కార్యకర్తల ద్వారా నేరుగా చేరువ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో పండించే వివిధ రకాల పంటల స్టాల్ ను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు, సర్పంచ్ ఎం.దివ్యభారతి, ఎంపిటిసి సభ్యులు శ్రీలక్ష్మి, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ ప్రహరాజ్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM
O.S.44/2022

Between:
Guddala Ramu & 6 others ...Plaintiff
And:
Milli Sirapayya & 2 others ...Defendants

SUMMONS

To,
D-2:Avala Ramu,
S/o. Avala Appalaswamy,
Kamavaram Village,
Pusapatirega Mandalam,
Vizianagaram District-535204.
D-3: Avala Appayamma,
D/o. Avala Appalaswamy,
Kamavaram Village,
Pusapatirega Mandalam,
Vizianagaram District-535204.

Please take notice that the above suit is filed against both of you for partition of ancestral property and said matter stands posted to **28-06-2023** for your appearance. If you have any objection you may attend either personally or through an Advocate before the above said Court at **10:30 A.M** on **28-06-2023,** failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
BEVARA VENU,
Advocate, D.No. 29-41-12,
Opp. District Court,
Visakhapatnam-20